

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు అటవీ ప్రాంతంలో జేసీబీపై దాడి చేసేందుకు కర్రలతో వెళ్తున్న ఆదివాసీలు

# గుడిసెల కూల్చివేతపై భగ్గుమన్న ఆదివాసీలు

- అటవీశాఖ అధికారులపై తిరగబడ్డ బాధితులు
- కర్రలు, కత్తులు, కారంతో దాడి
- వెనుదిరిగిన అధికారులు

ఏటూరునాగారం, జూన్ 16: గుడిసెల కూల్చివేతకు పూనుకున్న అటవీశాఖ అధికారులపై ఆదివాసీలు భగ్గుమన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు అటవీ ప్రాంతంలో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను జేసీబీ, డోజర్లతో తొలగించేందుకు ఎఫ్‌డీవో రమేశ్, ఎఫ్ఆర్‌వోలు అబ్దుల్ రెహమాన్, అప్సరున్నీసా, నరేందర్‌తో పాటు 60 మంది అటవీశాఖ ఉద్యోగులు పోలీసుల సహాయంతో రాగా ఆదివాసీలు అడ్డుకున్నారు. కర్రలు, కత్తులు, కారం చేత పట్టుకుని ఎదురుదాడికి సిద్ధమయ్యారు. జేసీబీ, డోజర్లపై కర్రలతో కొట్టడంతో భయంతో డ్రైవర్లు అక్కడ నుంచి వాహనాలను తీసుకెళ్లారు. ఘర్షణలో డోజర్ డ్రైవర్‌కు నుదిటిపై గాయమైంది. దీంతో అటవీశాఖ ఉద్యోగులు అక్కడ నుంచి మండల కేంద్రానికి చేరుకున్నారు. ఆదివాసీలంతా ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాను కలిసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నదని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, గుంట భూమిలో గుడిసెలు వేసుకుంటే కూల్చి వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి గొత్తికోయలు వచ్చి అడవిని విచక్షణారహితంగా కొట్టి ఇండ్లు నిర్మించుకుంటే పట్టించుకోకుండా తమపై ప్రతాపం చూపుతారా అంటూ మండిపడ్డారు. కాగా, ఈ ఘటనలో గిరిజనులపై పోలీసులు కేసు నమోదు చేశారు.





వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా దుకాణాలు, నివాసాలను కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్... వాహనాలు, సామానును బయటపెట్టుకుంటున్న బ్యాండ్ నిర్వాహకులు

# విమలక్క ఇంటిపైకి బుల్డోజర్

- ప్రజల ఇండ్లు, వ్యాపారుల దుకాణాలపైకీ బుల్డోజర్ ప్రయోగం
- జనశక్తి రాజన్న, అరుణోదయ విమలక్క ఇల్లు కూల్చివేత
- వేములవాడలో రోడ్డు విస్తరణ పనుల తీరుపై విమర్శల వెల్లువ

కరీంనగర్, జూన్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జనశక్తి కేంద్ర కమిటీ కార్యదర్శి కూర రాజన్న, రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ అలియాస్ అమర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఇంటిపైకి ప్రభుత్వం బుల్డోజర్ ప్రయోగించింది. వేములవాడలోని వారి నివాసాన్ని నేలమట్టం చేసింది. రాజన్న తల్లి కూర మల్లమ్మ 2019లో మృతి చెందేవరకు ఇదే ఇంట్లో నివసించారు. ప్రస్తుతానికి ఆ నివాసాన్ని పక్కన ఉన్న బంధువులు వినియోగించుకుంటున్నారు. వేములవాడలో రహదారి విస్తరణలో వీరి నివాసం మొత్తం నేలమట్టమైంది. పరిహారం అందకుండానే వీరి ఇల్లు నేలమట్టం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సామాను బయట పెట్టుకొని కాపలా కాస్తున్న మహిళ

మంగళవారం విమలక్కతోపాటు.. ఇతరులు కూల్చివేసిన ఇంటి వద్దకు వచ్చే అవకాశముందని తెలుస్తున్నది.

### అధికారుల తీరుపై విమర్శలు

వేమలవాడ రాజన్న ఆలయ పరిధిలో రోడ్డు విస్తరణ కోసం సోమవారం అధికారులు తీసుకున్న చర్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్డు పనులు చేపట్టిన అధికారులు ప్రజలు, చిరువ్యాపారులపై బుల్డోజర్లు ప్రయోగించడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి, భూమి స్వాధీనం చేసుకోవాలని అధికారులను, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలిసి వేడుకున్నా ఫలితం లేకుండాపోయిందని బాధితులు తెలిపారు. ఆయా అంశాలపై స్పష్టత రాకముందే సోమవారం తెల్లవారుజాము నుంచే.. పోలీసుల పహారా మధ్య బుల్డోజర్లను రంగలోకి దింపి కూల్చివేసిన తీరుతో బాధితులు ఆందోళనకు గురయ్యాయి.

### పరిహారం సంగతి ఏమైంది?

రోడ్డును 80 అడుగుల మేర విస్తరణ చేయాలని నిర్ణయించిన అధికారులు, 243 మంది నిర్వాసితులకు నోటీసులు ఇచ్చారు. ఇందులో కొంత మందికి మాత్రమే పరిహారం అందిందని, చాలామందికి బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వలేదని బాధితులు చెప్తున్నారు. ఇదే విషయాన్ని అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. ఏళ్ల తరబడిగా చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, ఒక్కసారిగా తమ భవనాలు కూల్చివేస్తే.. రోడ్డున పడాల్సివస్తుందని, తగిన పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో.. 88మంది హైకోర్టును ఆశ్రయించారు. కానీ ప్రభుత్వం, అధికారులు సోమవారం ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడమేంటని నిలదీస్తున్నారు.

### పోలీసు పహారా.. ప్రజల భయాందోళన

వేములవాడలోని మూల వాగు నుంచి రాజన్న ఆలయం వరకు అడుగడుగునా పోలీసులు పహారాగా నిలిచారు. జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో అమరవీల స్థూపం నుంచి రాజన్న ఆలయం వరకు దాదాపు 200 మంది పోలీసులను మోహరించారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కూల్చివేతలను పరిశీలించారు. ప్రజల నివాసాలు, చిరువ్యాపారుల దుకాణాలను కూల్చివేశారు. నోటీసుల గడువు ముగిసిన మరుసటి రోజు నుంచే.. కూల్చివేతలు చేపట్టడం వ్యాపార వర్గాలను కలిచివేసింది. పది బృందాలు ఏర్పాటు చేసి, ఒక్కో బృందానికి ఒక్కో తహసీల్దార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది.



# ఇండ్ల జాబితాలో మా పేర్లేవి?

- ప్రశ్నించిన నక్కలపేట గ్రామస్థులు
- పంచాయతీ ఎదుట ఆందోళన

ధర్మపురి, జూన్ 16 : 'ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాలో మా పేర్లు ఉన్నాయని స్థానిక కాంగ్రెస్ నాయకులు చెప్పిన్రు. ఇప్పుడు ఫైనల్ జాబితాలో లేవంటున్నరు. మా పేర్లు ఏమైనయ్' అంటూ జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నక్కలపేట గ్రామస్థులు ప్రశ్నించారు. మొదటి విడత ఫైనల్ లిస్టులో ఉన్న 19మందితోపాటు మరి కొందరు ఇండ్లు లేని నిరుపేదలు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇండ్లు ఉన్నవారి పేర్లు, కాంగ్రెస్ కార్యకర్తల పేర్లు మాత్రమే ఫైనల్ లిస్టులో ఉండటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి విడత 60 మంది లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేశారని, కానీ, ఈనెల 14న 41 మందికే ప్రొసీడింగ్స్ ఇచ్చారని వాపోయారు. కేవలం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సూచించిన వారికి మాత్రమే ఇండ్లు మంజూరు చేశారని, అందులో కొందరికి ఇండ్లు ఉన్నప్పటికీ మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందించారని ఆగ్రహించారు. ఇది అన్యాయమని మండిపడ్డారు.

### పాతిల్లు కూలగొట్టుకున్న.. ఇప్పుడు పేరు లేకపాయె

నేను రోజూవారి కూలీగా పనిచేసి బతుకుతున్న. మట్టిగోడలు, గూనపెంకులతో శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నేను, నా భార్య, రెండేండ్ల కూతురితో కలిసి నివసిస్తున్నం. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. అయితే మొదటి విడత లిస్టులో పేరున్నదని, ఖాళీ జాగా చూపిస్తే ఇంటిని నిర్మించి ఇస్తామని, మంత్రి వచ్చి ముగ్గుపోస్తారని అధికారులు, కాంగ్రెస్ నాయకులు పదేపదే చెప్పిన్రు. ఇది నమ్మి ఉన్న ఆ ఇంటిని కూలగొట్టుకున్న. వచ్చి ముగ్గుపోస్తరనే ఆశతో జాగాను చదును చేసి ఉంచిన. తీరా ఇప్పుడు చూస్తే లిస్టులో పేరులేదని చేతులెత్తేసిన్రు. నాకు నిలువ నీడ లేకుండా పాయె.

– ఆకుల అనిల్, నక్కలపేట

## పాలమూరులో నిరుద్యోగుల ర్యాలీ

మహబూబ్‌నగర్, జూన్ 16 : జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం వేసిన ఉద్యోగాలు తప్ప కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని పేర్కొన్నారు. నోటిఫికేషన్ల జారీ కోసం ఈ నెల 20న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు.




# భూకబ్జాకు ఎమ్మెల్యే దొంతి యత్నం!

- ఆయన అనుచరుల దౌర్జన్యం
- ఎమ్మెల్యేతో ప్రాణభయం.. రమేశ్

సుబేదారి, జూన్ 16 : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని బాధితుడు దేవర రమేశ్ ఆరోపించాడు. ఈ మేరకు ఆయన హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మీడియాతో మాట్లాడాడు. హనుమకొండలోని ములుగురోడ్డు కాపువాడలో సర్వేనంబర్ 769లో వారసత్వంగా వచ్చిన భూమి ఉండగా అందులో తాను చాలా ఏండ్ల క్రితమే షెడ్డు నిర్మించినట్టు తెలిపాడు. తన భూమి పక్కనే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భూమి ఉన్నదని, నాలా కూడా ఆక్రమించుకున్నట్టు పేర్కొన్నాడు. తమ భూమిని కబ్జా చేయడానికి చాలా ఏండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపించాడు. కోర్టు కమిషన్ నియమించి 2004లో ఆ భూమి తమదేనని జడ్జిమెంట్ ఇచ్చినట్టు తెలిపాడు. ఎట్లయినా తన భూమిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మాధవరెడ్డి రాజకీయ బలంతో కొద్దిరోజుల నుంచి అతని తమ్ముడు తిరుపతిరెడ్డిని ముందు పెట్టి అనుచరులను తమ ఇంటికి పంపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని వాపోయాడు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే సోదరుడితో పాటు వారి మనుషులు పది మంది వచ్చి బోరు వేయకుండా అడ్డుకున్నట్టు తెలిపాడు. మళ్లీ ఆదివారం అర్ధరాత్రి అనుచరులను పంపి తమ షెడ్డు గేటుకు వైర్ కట్టి, ప్రహరీ, బోరును ధ్వంసం చేసినట్టు రమేశ్ వాపోయాడు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఎమ్మెల్యే, అతని అనుచరులతో తనకు ప్రాణభయం ఉన్నదని, రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు. ఈ ఘటనపై హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



బాధితుడు రమేశ్

- ఒకరి తర్వాత ఒకరు.. ఒంటికొస్తే అంతే..!



నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. పాఠశాలలో సుమారు 220 మంది విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులు ఉండగా, ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉండటంతో ఒంటికొస్తే క్యూలైన్లలో నిలబడి అవస్థలు పడుతున్నారు. సమస్యను గుర్తించిన గత బీఆర్ఎస్ సర్కారు మన ఊరు..మన బడి కింద నిధులు మంజూరు చేసినా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మూడేండ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా పనులు పూర్తిగా చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. – నిజామాబాద్




రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరవుపేట మండలం రాజుపేట పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

## 40 మంది విద్యార్థులకు ఒక్క టీచరేనా?

### టీచర్లను కేటాయించాలని రాజుపేటలో నిరసన

గంభీరావుపేట, జూన్ 16 : తమ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదుట సోమవారం విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు నిరసనకు దిగారు. పాఠశాల పునఃప్రారంభమై ఐదురోజులు గడిచినా ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే వస్తున్నారని, గతంలో నలుగురు ఉండేవారని తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి వరకు 40 మందికిపైగా చదువుకుంటున్నారని, అంతమంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. వెంటనే విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

- బిల్లులు రాక సర్కారు బడికి తాళం



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా గ్రామంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో సోమవారం కాంట్రాక్టర్ గడ్డం శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాలకు తాళం వేశాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 'మన ఊరు– మన బడి' కింద రూ.40 లక్షలతో ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్‌లో అభివృద్ధి పనులు చేపట్టాడు. ఇందులో బీఆర్ఎస్ సర్కారు రూ.13 లక్షలు చెల్లించింది. ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, మిగతా రూ.27 లక్షల కోసం ప్రభుత్వానికి నివేదించాడు. ఆస్తులు, ట్రాక్టర్, ఎడ్లు అమ్మగా రూ.18 లక్షలు వచ్చాయి. వీటిని బాకీ ఉన్నవారికి చెల్లించాడు. మిగతా రూ.9 లక్షల కోసం బాకీ వాళ్లు వేధిస్తున్నట్టు తెలిపాడు. 18 నెలలు గడిచినా డబ్బులు రాకపోవడంతో గ్రామస్థులతో కలిసి పాఠశాలకు తాళం వేసి ఆందోళన నిర్వహించాడు. బిల్లులు చెల్లించకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని శ్రీనివాస్ హెచ్చరించాడు. – ఖానాపూర్ రూరల్

- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్‌లు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ మే నెలలో సర్పంచ్‌ల బిల్లులను క్లియర్ చేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని చెప్పారు. మాయమాటలు చెప్పి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే మాజీ సర్పంచ్‌లు, ప్రజలందరినీ కలుపుకుని ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ నెల 20 లోపు బిల్లులు చెల్లించకపోతే జిల్లాలోని 461 మంది మాజీ సర్పంచ్‌లతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. – మహబూబాబాద్ రూరల్

### బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల బకాయిలు విడుదల చేయాలి

హైదరాబాద్, జూన్16 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మనాయక్, ఆర్ శ్రీరాంనాయక్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి నిధులు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. ఈ కారణంగా పలు ప్రైవేట్ పాఠశాలల, పేద విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఆ బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే దళిత గిరిజన సంఘాలు, విద్యార్థిసంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పూనుకుంటామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

### విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అలంపూర్, జూన్ 16 : హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు పీ నారాయణ, శైలేష్‌పై దాడి ఘటనను నిరసిస్తూ సోమవారం అలంపూర్ సివిల్ కోర్టులో న్యాయవాధులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులు మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకూ దాడులు అధికమవుతున్నాయని, ప్రభుత్వం కఠినమైన చట్టాలను తీసుకువచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు.

### అనర్హులకు ఇండ్ల కేటాయింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ములుగు, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : అనర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నారంటూ ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ టీఎస్ దివాకరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యాదవసంఘం అధ్యక్షుడు కత్తుల రమేశ్ మాట్లాడుతూ.. 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, భూమిలేని పేదలకు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికే పునాది తీసి పిల్లర్స్ వేసిన ఇండ్లను బిల్లులు తీసుకునే ప్రయత్నం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి.. పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించాలని వెంకటాపూర్ ఎంపీడీవోను ఆదేశించినట్టు రమేశ్ తెలిపారు.

### సీఏపీఎఫ్ విజేతలకు అభినందన

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) అసిస్టెంట్ కమాండెంట్ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులను శాంతిభద్రతల డీజీ మహేశ్ భగవత్ అభినందించారు. 2024 నోటిఫికేషన్ నాటి తుది ఫలితాలు జూన్ 13న విడుదలయ్యాయి. మొత్తం 459 మంది అభ్యర్థులు ఎంపికవగా, మహేశ్ భగవత్ మార్గదర్శకత్వంలో ఇంటర్వ్యూకు సిద్ధమైన 66మంది ఎంపికయ్యారు. వారిలో శ్యామ్‌యాదవ్ 2వ, శ్రేయస్ 5వ, కుల్దీప్ బిష్ణోయ్ 13వ, అనికేత్ త్రిభువన్ 20వ, రియా 35వ, సిద్ధేశ్ యోలే 49వ ర్యాంకులు సాధించారని తెలిపారు.